క్లుప్తంగా

రెడ్‌కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



పాతగుంటూరు: రింగ్‌రోడ్డులోని శుభం కన్వెషన్ సెంటర్‌లో రెడ్‌కార్పెట్ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. నిర్వాహకులు ఆర్.కె.నాయుడు, శైలజారామ్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో క్లాత్, జ్యూయలరీ, హోమ్‌డెకార్స్‌కు సంబంధించి 40 స్టాల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 3న రాత్రి 9 గంటల వరకు నగర ప్రజలకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు సందర్శించాలని కోరారు.

గుంటూరులో 'బ్రో' చిత్రయూనిట్ సందడి



పాతగుంటూరు: సాయిధరమ్ తేజ్ హీరోగా నటించిన బ్రో చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా మంగళవారం గుంటూరులోని ఓ థియేటర్‌ను చిత్ర యూనిట్ సందర్శించారు. థియేటర్‌లోని అభిమానులను పలుకరించారు. ఈసందర్భంగా సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ అందరూ కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమన్నారు. మీ అభిమానంతో మరిన్ని సినిమాల్లో నటిస్తానన్నారు. ఆయన వెంట చిత్ర దర్శకుడు సముద్ర ఖని, చిత్ర యూనిట్ ఉన్నారు.


6న సినీ సంగీత విభావరి

పాతగుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఈనెల 6వ తేదీన మధుర గాయకుడు రామకృష్ణ ఆణిముత్యాలు పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీశుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని కోరారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై జరిగిన లైంగికదాడిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సేకరించిన సమాచారం మేరకు 15 సంవత్సరాల బాలిక ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన యువకుడితో స్నేహంగా మెలిగింది. యువకుడు బాలికను ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సమాచారం.

వీరాంజనేయుడికి విశేషపూజలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రామాలయం వద్ద నున్న అభయాంజనేయస్వామి వారికి శ్రావణమాస పూర్ణిమ మంగళవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు రాజేంద్రశర్మ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర,సహస్రనామాలతో పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

6న మహమ్మద్ రఫీ సంగీత విభావరి

తెనాలి: ప్రముఖ గాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా ఈనెల 6వ తేదీన రఫీ సాబ్ కె గానే సంగీత విభావరిని నిర్వహించనున్నారు. ఇక్కడి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో డాక్టర్ కె.పురుషోత్తమరావు ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి 9 గంటల వరకు జరిగే విభావరిలో ఆయనతోపాటు షేక్ బి.సైదా, పీఎల్ ఆలీఖాన్, షేక్ ఖాజా షానవాజ్, పి.శివలీల, ఎం.మల్లికలు రఫీ గీతాలను గానం చేస్తారు. రఫీ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

లేఅవుట్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అపార్ట్‌మెంట్ కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కాకాని రోడ్డులో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, నందివెలుగు రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్‌మెంట్‌ను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్ గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అదేవిధంగా నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డీపీఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని, లేకుంటే తదుపరి అనుమతులను నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ మంజూరు చేయబోమన్నారు. ఈ పర్యటనలో డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసీపీ బాబురావు, టీపీబీఓ రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బిషప్ జాన్‌పాల్

తెనాలిరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ పిన పాటి జాన్‌పాల్ మంగళవారం విలేకర్లతో మట్లాడారు. శాంతిని కోరుకునే క్రైస్తవులపై దాడులను కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. దేశంలో శాంతి నెలకొనాలని కోరుతూ బుధవారం ఉదయం 9 గంటలకు చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. తెనాలి, పరిసర ప్రాంత పాస్టర్లు, క్రైస్తవులు, క్రైస్తవ నాయకులు, ప్రాజాస్వామ్యవాదులు, ముస్లింలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట అసోసియేషన్ నాయకులు బిషప్ కె. సుధీర్‌కుమార్, రెవ ఎ. భానుప్రసాద్, బిషప్ ఎస్. ఇమ్మానియేల్ దాస్, బిషప్ పాముల పరంజ్యోతి, రెవ సర్వోన్నతరావు, పాస్టర్ పి. డేవిడ్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌ఓ చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ ఉద్యోగుల నిరసనలో భాగంగా మంగళవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు నల్లచెరువులోని డీఈ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. డీఆర్‌ఓ కె.చంద్రశేఖరరావుకు వినతి పత్రం సమర్పించారు. జేఏసీ కార్యదర్శి రాజేష్ ఖన్నా మాట్లాడుతూ సచివాలయాలలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు జేఎల్‌ఎం గ్రేడ్–2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్టు వర్కర్‌లను రెగ్యులర్ చేయాలన్నారు. పే రివిజన్ కమిషన్‌ను అమలు చేయాలని డిమాండు చేశారు. జేఏసీ చైర్మన్ ఆంజనేయులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మానవ హక్కులను పరిరక్షించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నాయకులు

నెహ్రూనగర్: మణిపూర్ ఘటన యావత్ దేశాన్ని కలిచి వేసిందని, అక్కడ జరుగుతున్న అరాచకాలను అరికట్టి, బాధ్యులను కఠినంగా శిక్షించడంతో పాటు మానవ హక్కులను పరిరక్షించాలని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ స్టేట్ సెక్రటరీ జాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదురు మణిపూర్ అల్లర్లకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మానవ హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించిన నిందితులకు ఉరి శిక్ష విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సద్గుణ్‌కుమార్, నాయకులు పద్మావతి, రమేష్, జాన్‌బెన్నీ, సుధాకర్, ప్రభుదాస్, ఆనంద్, కిరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకున్న జిల్లా జడ్జి రాజగోపాలరావు

పాతగుంటూరు: లాలాపేటలోని పద్మావతి అండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మంగళవారం గుంటూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి సి.హెచ్.రాజగోపాలరావు సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో జిల్లా జడ్జికి స్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జిని సత్కరించి ప్రసాదం అందజేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, అర్చకులు మురళీ చంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రావు

పాతగుంటూరు: ప్రజారవాణ శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు అన్నారు. మంగళవారం కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో విస్తృత స్థాయి జిల్లా కౌన్సెలింగ్ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కరిముల్లా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రావు, జి.వి.నర్సయ్య పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు పీటీడీ ఉద్యోగులుగా మారినంతరం రద్దు చేసిన పాత సదుపాయాలు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకరరావు, కార్యదర్శి ఎస్.వి.కృష్ణారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇజ్రాయిల్‌పేటకు చెందిన గూడూరు రాజేష్ (24) కు గత ఐదు సంవత్సరాల క్రితం రమ్యతో వివాహమైంది. దంపతుల మధ్య వివాదాలు జరుగుతుండటంతో భార్య రమ్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనేపథ్యంలో మనస్తాపానికి గురైన రాజేష్ మంగళవారం నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దావీదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోని బ్యాగు చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో బ్యాగు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బృందావన్ గార్డెన్స్ నాల్గోలైనులో నివాసం ఉండే షేక్ జాకియా హ్యాండ్ బ్యాగును ఇంట్లోని టేబుల్‌పై ఉంచింది. రెండో రోజు చూడగా బ్యాగు కనిపించలేదు. అందులోని పది గ్రాముల బంగారం, రూ. 2వేలు నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల మధ్య ఘర్షణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ముగ్గురు యువకులపై ఐదుగురు యువకులు దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదా కాలనీ 15వలైనులో సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీ, నవీన్‌లు రోడ్డుకు అడ్డుగా ద్విచక్రవాహనాలు నిలబెట్టి మాట్లాడుకుంటున్నారు. శివనాగరాజు, వెంకట్రావు, శరత్ కుమార్‌లు రోడ్డుకు అడ్డుగా ఉన్న ద్విచక్రవాహనాలు తీయాలని కోరారు. ఈ విషయమై ఘర్షణ జరిగింది. ఐదుగురు యువకులు, ముగ్గురు యువకులపై దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: ఐదుగురు యువకులు మహిళపై దాడిచేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమణ అనే మహిళ పాత పరిచయం నేపథ్యంలో శివనాగరాజు కాలనీలో క్రాంతి ఇంటికి వెళ్లింది. అయితే క్రాంతి, సన్ని, మణిరెడ్డి, వంశీ, నవీన్‌లు రమణపై దాడిచేసి, ఆమె ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి కౌన్సెలింగ్

తెనాలి: ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో ఆగస్టు–2023 విద్యాసంవత్సరం రెండో విడత ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపల్/ జిల్లా కన్వీనర్ రావి చిన్నవెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ ఐటీఐ, తెనాలిలో మొత్తం 276 సీట్లకు గాను కేవలం 70 సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు తెలిపారు. మిగిలిన 206 సీట్లను 300 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు అందరికీ సీట్లు వచ్చే అవకాశం ఉన్నందున 3న జరిగే కౌన్సెలింగ్‌కు రావాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మొత్తం 1368 సీట్లకు కేవలం వంద సీట్లు మాత్రమే భర్తీ అయినట్టు చెప్పారు. మిగిలిన 1268 సీట్లకు 1025 దరఖాస్తులు మాత్రమే వచ్చాయనీ, అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న ఐటీఐల్లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

13న చిత్రలేఖనం పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న తాడేపల్లి బాలోత్సవం నిర్వాహకులు

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వివిధ పాఠశాలల్లో తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు బాలోత్సవం నిర్వాహకులు అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని బాలోత్సవం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ పాఠశాలల్లో సీనియర్స్ విభాగం 8,9,10 తరగతులు, జూనియర్ విభాగం 6,7 తరగతులు, సబ్ జూనియర్స్ 3,4,5 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జెండా వందనం, స్వాతంత్ర్య సమరయోధులు, దేశమును ప్రేమించుమన్న చరణాలపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం రెండు నుంచి నాలుగు గంటల వరకు తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని సీఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపాన గల అమరావతి ఐకాన్ అపార్ట్‌మెంట్ ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు ఈ నెల 10వ తేదీలోపు 9490099559 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రంలోనే తలమానికంగా ఎంసీహెచ్ వార్డు



డాక్టర్ పట్టాభిరామన్‌తో కలిసి ఎంసీహెచ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ సహకారంతో గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింఖానా పేరుతో సుమారు రూ.80 కోట్లతో నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏపీలోనే తలమానికంగా నిలుస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జింఖానా కార్యదర్శి, 1983 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ సామినేని పట్టాభిరామన్ ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఎంసీహెచ్ వార్డు రెండు ఫ్లోర్లు పూర్తి కావచ్చాయని, మరో నాలుగు ఫ్లోర్ల నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామన్నారు. డాక్టర్ పట్టాభిరామన్ మాట్లాడుతూ ఎంసీహెచ్ వార్డు నిర్మాణాన్ని వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అనేక మంది పూర్వ విద్యార్థులు ఎంసీహెచ్ నిర్మాణం కోసం విరివిగా విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారన్నారు. శరవేగంగా నిర్మాణ పనులు సాగడం సంతోషంగా ఉందన్నారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందనాయక్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యార్థి అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ

- పాఠశాలకు వెళ్లి విచారించిన డీఈఓ శైలజ
- బాధ్యులైన హెచ్‌ఎం, పీఈటీ సస్పెన్షన్



జీజీహెచ్ క్యాజువాల్టీలో విద్యార్థి లాల్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: కాలం చెల్లిన ఐరన్ ట్యాబ్లెట్లు మింగి తీవ్ర అనారోగ్యానికి గురైన విద్యార్థి లాల్ అహ్మద్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పరామర్శించారు. అదే సమయంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి విద్యార్థికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి లాల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని డీఈఓ శైలజ చెప్పారు.

పాఠశాలకు వెళ్లి విచారణ..

డీఈఓ శైలజ ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ జరిపారు. ఏఎన్‌ఎంలు ఇచ్చిన ట్యాబ్లెట్లను పరీక్షించకుండా నేరుగా విద్యార్థులకు పంపిణీ చేసిన సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని ప్రశ్నించారు. విద్యార్థి తండ్రి అబ్దుల్ హనీఫ్‌తో మాట్లాడారు. డీఈఓ వెంట డీవైఈఓ వి.వెంకటేశ్వరరావు ఉన్నారు. సంఘటనకు బాధ్యులను చేస్తూ కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డితో పాటు పీఈటీ శిరీషారాణిని సస్పెండ్ చేశారు.

సీతారామయ్య స్కూల్లో గ్రీన్ డే వేడుకలు



చిన్నారులతో మాజీ డీజీపీ మాలకొండయ్య, శివాజీ, విష్ణువర్ధన్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆకుపచ్చని రంగు వస్త్రాలను ధరించిన చిన్నారులు ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను చాటారు. అదే వర్ణంలో గీసిన డ్రాయింగ్స్, చెట్లు, ఫలాలను పోలిన క్రాఫ్ట్స్‌తో ఆకట్టుకున్నారు. పాఠశాలను సందర్శించిన మాజీ డీజీపీ ఎం. మాలకొండయ్య కార్యక్రమాన్ని తిలకించిన అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రగతికి సోపానమని, కాలుష్యాన్ని తగ్గించుకునే విధానాలను ప్రజలే స్వచ్ఛందంగా పాటించాలని అన్నారు. మొక్కలను విధిగా నాటి, భావి తరాలకు కాలుష్య రహిత ప్రకృతిని అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రీ ప్రైమరీ విద్యార్థులు నాటికలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, మాజీ అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బయ్య, కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టం



తల్లిపాల వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని

నెహ్రూనగర్: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడంతో పాటు తల్లిపాలు పిల్లలకు పట్టించడం ద్వారా చిన్నారులు ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ పీడీ బి.మనోరంజని తెలియజేశారు. మంగళవారం పండరీపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రంలో బిడ్డ బరువు చూయించాలని, బిడ్డ వయస్సుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు చూసుకోవాలన్నారు. అనంతరం వెల్ బేబీ షో నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. అడిషనల్ డీఎంహెచ్ఓ సుబ్బారావు, ఏసీడీపీఓ చంద్రకళ, స్థానిక కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ అబూబకర్, సూపర్‌వైజర్ రెహమాన్, ఐటీసీ జిల్లా కో–ఆర్డినేటర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

తల్లులకు ఎఫ్‌ఆర్‌ఎస్‌పై అవగాహన...

నెహ్రూనగర్: అర్హులైన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే క్రమంలో భాగంగా ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం) తీసుకొచ్చిందని ఇక నుంచి దీని ద్వారా తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని ఈస్ట్ 1 సెక్టార్ సూపర్‌వైజర్ తబిత తెలియజేశారు. మంగళవారం బసవతారకరామనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు తల్లి పాల వారోత్సవాలతో పాటు, ఎఫ్‌ఆర్‌ఎస్ సిస్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం 10 రకాల పౌష్టికాహార సరుకులను అందజేస్తుందన్నారు. ఇందులో ఫోర్టిఫైడ్ రైస్ తీసుకోవడం ద్వారా ఐరన్, బీ 12 ఇతర పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది శ్యామల, ధనలక్ష్మి, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల సమస్యకు దొరికిన పరిష్కారం



డొంకను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కాకుమాను: మండలంలోని కాకుమాను, చిన కాకుమాను గ్రామాలను అనుసంధానం చేస్తూ.. ఉన్న డొంక సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సహకారంతో త్వరలో డొంక అభివృద్ధికి పనులను చేపట్టనున్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ డొంకను పరిశీలించి, సర్వే చేయించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాతూ.. కాకుమాను నుంచి చిన కాకుమానుకు వెళ్లే డొంక అధ్వానంగా ఉండడంతో రెండు గ్రామాల ప్రజలు, ముఖ్యంగా కాకుమాను ఎస్సీ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్సీ కాలనీ వాసుల శ్మశాన వాటికకు ఈ డొంక మార్గం కావడంతో.. వర్షాల సమయంలో అంతిమయాత్రలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత దృష్టికి తీసుకువెళ్లడంతో.. వెంటనే సర్వే చేయించి నివేదిక అందజేయాలని ఆమె సూచించారని వెల్లడించారు. డొంక అభివృద్ధిలో భాగంగా సుమారు కిలోమీటరు వరకు సీసీ రోడ్డు, మూడు కిలోమీటర్ల వరకు గ్రావెల్ రోడ్డును వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ ఏఈ ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి పూర్ణయ్య, గ్రామ సర్వేయర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.